క్లుప్తంగా

నేడు చియ్యపాడులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని చియ్యపాడు గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్యాధికారి శ్రీవాణి ఆధ్వర్యంలో గ్రామస్థులు వైద్య పరీక్షలు నిర్వహించి 104 వాహనం ద్వారా అన్ని రకాలైన మందులను పంపిణీ చేస్తామన్నారు. అవకాశాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

13న మండల సమావేశం

కాశినాయన : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ నల్లేరు పోలమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ముజఫర్ రహీమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి పనులపై చర్చించనున్నట్లు తెలిపారు. కావున మండలస్థాయి అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

బి.కోడూరులో..

బి.కోడూరు : మండల కేంద్రమైన బి.కోడూరు వెలుగు సభా భవనంలో బుధవారం ఎంపీపీ కోడూరు చెన్నమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంగళవారం ఒక ప్రకటణలో తెలిపారు. ఈ సమావేశంలో తాగునీరు, వైద్యం, పారిశుధ్యం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : స్థానిక మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన అనాథ తప్పెట నారాయణకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు బంధువులు ఎవరూ లేకపోవడంతో ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావు ఆధ్వర్యంలో హిందూ శ్మశాన వాటిలో సాంప్రదాయ ప్రకారం మంగళవారం నారాయణ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ సీఈఓ మల్లికార్జున్, సుభాన్, సుబ్బయ్య, భార్గవ్‌సాయి, సుమన్‌బాబు, అశోక్, శివసాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ



విద్యార్థులకు యోగా నేర్పుతున్న యోగా గురువు ప్రభాకర్ రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలోని విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. యోగా గురువు భూమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ యోగాతో శరీరంలోని అన్ని శక్తులు చైతన్యవంతమవుతాయన్నారు. విద్యార్థులకు సూర్య నమస్కారాలు, ఆసనాలు నేర్పించారు. జిరాఫీ చెస్, క్యారంబోర్డులను విద్యార్థులచే ఆడించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, వెంకటకొండయ్య, రెహ్మాన్ ఖాన్, శారద పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న 3.15 లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో అతి పెద్ద రవాణా సంస్థ అయిన రైల్వేశాఖలో కేంద్ర ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. వందే భారత్ రైలు ప్రారంభత్సవం చేస్తున్న మోదీ ప్రచార ఆర్భాటాలు చేయడం తప్ప చేసింది శూన్యమని విమర్శించారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ ఒక్క ఉద్యోగం కూడ భర్తీ చేయలేదని విమర్శించారు. డీవైఎఫ్ఐ నాయకులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కలశాల ఊరేగింపు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డు సమీపంలోని వాసవీ కాలనీలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ రాజగోపుర ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి రోజు మంగళవారం కలశాలను స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి వాసవీ కాలనీలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఆలయంలో సాయంత్రం స్వస్తివాచనం, అంకురార్పణతో యాగశాల నిర్వహించి చతుర్వేది పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

‘అమ్మ ఒడి’లో అన్నదానం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన క్రిష్టఫర్ జార్జి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక అమ్మ ఒడి బాలల ఆశ్రమంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు రవి, సరోజ తొలుత ప్రార్థనలు నిర్వహించి పిల్లలందరినీ ఆశీర్వదించారు.

కొత్తపల్లె సమస్యలను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి

ప్రొద్దుటూరు : వచ్చే ఎన్నికల నాటికి కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించామన్నారు. ఈ కార్యక్రమంతో ప్రజల్లో ప్రభుత్వానికి, పార్టీకి రెండింతలు గౌరవం పెరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా గడపగడపకు మన ప్రభుత్వం లాంటి కార్యక్రమాన్ని ఎవరూ చేయలేదన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి 30 గ్రామ పంచాయతీలు, 40 వార్డుల్లో తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా సుమారు 25వేలు జనాభా గల కొత్తపల్లె పంచాయతీ పరిధిలో ప్రధాన సమస్యలను గుర్తించామన్నారు. రాగిపైసా అంత అవినీతి లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో మంచి టీం ఉందని, అభివృద్ధి పనులు బాగా జరుగుతున్నాయన్నారు.

20 ఏళ్లుగా కొత్తపల్లె పంచాయతీని పట్టించుకోలేదు

గత పాలకులు 20 ఏళ్లుగా వేలాది మంది నివసిస్తున్న కొత్తపల్లె గ్రామ పంచాయతీ సమస్యలను ఎవరూ పట్టించుకోలేదన్నారు. అమృతానగర్‌లో 33 రోడ్లు వేసినా అడ్డ రోడ్లు వేయకపోవడంతో నీరు, జమ్ము నిలిచి ఇబ్బందిగా ఉందన్నారు. వివేకానంద కాలనీ, ప్రకాష్‌నగర్ కాలనీ, ఆటోనగర్, మత్స్య కాలనీ ప్రాంతాల్లో రోడ్లు, కాలువల సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఇందుకు కోట్ల రూపాయలు అవుతుందని అంచనా వేశామని తెలిపారు. కలెక్టర్ విజయరామరాజు ద్వారా డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయాలని కోరుతామని, గ్రామ పంచాయతీ నిధులుంటే అభివృద్ధి చేస్తామని, రెండు కాదంటే తన సొంత డబ్బు ఖర్చు చేసి పనులు చేయిస్తానన్నారు. సుమారు రూ.10కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఏదో ఒక విధంగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.



భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి

ప్లానింగ్ సెక్రటరీలకు ట్యాబ్‌లు పంపిణీ

మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ప్లానింగ్ సెక్రటరీలకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మంగళవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన 42 సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి ట్యాబ్‌లను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్‌చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు భూమి పూజ

మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో రూ.22లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మంగళవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఏపీ అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు గడువు పెంపు

ప్రొద్దుటూరు : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాల కోసం గడువును పొడిగించినట్లు ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీసీహెచ్ జగదీశ్వరుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం గత నెల 29 నుంచి ఈనెల 5వ తేదీ వరకు కౌన్సిలింగ్ నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం గడువు పొడిగించిందని, యథావిధిగా రోజూ కౌన్సిలింగ్‌కు హాజరు కావచ్చునని వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కౌన్సిలింగ్‌కు విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీ పేమెంట్ రిసిప్ట్, హాల్ టికెట్ ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ సర్టిఫికేట్, 6–10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్సి సర్టిఫికేట్, కొత్తగా జారీ చేయబడిన ఈడబ్ల్యూఎస్ సర్టిపికెట్లు తీసుకురావాలన్నారు. 2020 జనవరి 1 తర్వాత తీసుకున్న ఇన్‌కం సర్టిఫికెట్, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, టీసీ ఓరిజనల్‌తోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని కోరారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు గౌరవం

ప్రొద్దుటూరు : టీడీపీ హయాంలో బీసీలకు ఎలాంటి మేలు జరగలేదని.. వైఎస్సార్‌సీపీతోనే వారికి ఎనలేని గౌరవం దక్కిందని బీసీ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. వ్యక్తిగత సమస్యల కారణంగా హత్యకు గురైన నందం సుబ్బయ్య నారా లోకేష్‌కు దేశ నాయకుడిలా కనిపిస్తున్నాడా అని ప్రశ్నించారు. నందం సుబ్బయ్య కనీసం వార్డు మెంబర్ కూడా కాదన్న విషయాన్ని తెలుసుకోవాలని పేర్కొన్నారు. స్థానిక భావనారుషి ఆలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీలకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. బీసీలంటే నారా లోకేష్ చిన్న చూపు చూస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్ద పీట వేసి చైర్‌పర్సన్లు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచ్ పదవులును కేటాయించగా, టీడీపీ తమకు ఉన్న 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతిని కూడా సస్పెండ్ చేసిందన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి బీసీలకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నారని తెలిపారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేష్ బీసీ నేతల ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదన్నారు. గతంలో ఎంతో మంది బీసీ నాయకులను టీడీపీ పొట్టన పెట్టుకుందని తెలిపారు. చేనేత కార్మికులు నివసిస్తున్న వార్డుల్లో పాదయాత్ర నిర్వహించిన లోకేష్ కనీసం ఒక్క చేనేత కుటుంబాన్ని అయినా పరామర్శించారా అని ప్రశ్నించారు. చర్చిలకు వెళ్లకుండా క్రైస్తవులను అవమానించారన్నారు. 35వ వార్డు కౌన్సిపల్ పిట్టా బాలాజీ, మాజీ సర్పంచ్ రమణయ్య యాదవ్ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని మరోసారి గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు రావులకొల్లు అరుణ, చింపిరి అనిల్‌కుమార్, బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు చౌడం రవిచంద్ర, ఉప్పర మురళీ, తుపాకుల వెంకటరమణ, బండారు లక్ష్మీదేవి సూర్యనారాయణ, రాగా నాగలక్ష్మి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ ప్రజాప్రతినిధులు

పీహెచ్‌సీలో ఐడీసీఎఫ్ కార్యక్రమం

బి.కోడూరు : మండల కేంద్రమైన బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారులు డాక్టర్ ఎస్.వినీత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో ఐడీసీఎఫ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్యాధికారి ఐహెచ్ఐపీ, అంటు వ్యాధులు, మాతాశిశు సంరక్షణ కార్యక్రమం, పీహెచ్‌సీలో కాన్పులు, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం, రక్తహీనత కలిగిన గర్భిణులను గుర్తించడం, హైరిస్క్ గర్భిణుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొదలైన విషయాలను వివరించారు. 5 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి వారిలో వాంతులు, విరేచనాలు ఉన్న వారిని గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు 14 రోజుల పాటు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, ఆశా నోడల్ అధికారి పుష్పాంజలి, సీహెచ్‌ఓ నాగమణి, ఆరోగ్య పర్యవేక్షకులు విజయలక్ష్మి, ఫ్యామిలీ ఫిజీషియన్ అబ్జర్వర్ రామతీర్థం, వైద్య సిబ్బంది, సీహెచ్‌ఓలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి వినీత్

మదనపల్లె సభను జయప్రదం చేయండి

కడప సెవెన్‌రోడ్స్: మదనపల్లెలో ఈనెల 19న జరిగే బహుజన రాజ్యాధికార సభను జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గుర్రప్ప, నాయకులు కానుగదానం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆ పార్టీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె సభకు బీఎస్పీ జాతీయ కో ఆర్డినేటర్ ఆకాశ ఆనంద్, 17 రాష్ట్రాల ఇన్‌ఛార్జి, రాజ్యసభ సభ్యులు రామ్‌జీ గౌతమ్, రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, రాష్ట్ర కో ఆర్డినేటర్ బాలయ్య తదితరులు హాజరవుతారన్నారు. జిల్లానుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబయ్య, రాజగోపాల్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కొండాపురం : గండికోట జలాశయం కింద ముంపునకు గురైన మొదటి విడత 14 గ్రామాలకు అదనపు పరిహారం కోసం దరఖాస్తులు రెవెన్యూ సిబ్బందితో తీసుకుంటున్నట్లు మండల తాహసీల్దార్ శోభనబాబు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా నిర్వాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మొదటి విడత గ్రామాల్లోని నిర్వాసితులు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను అందజేయా లని చెప్పడంతో నిర్వాసితులువచ్చి రెవెన్యూ సిబ్బందికి అందజేస్తున్నారు. మొదటి విడత గ్రామాలు దత్తాపురం 539, కె.బొమ్మేపల్లె 64, దొరువుపల్లి 25, గంగాపురం 19, సీతాపురం 03, పక్కీరపేట 5, ముచ్చుమ్రి 69, చౌటిపల్లె 257, రేపల్లె 126, బుక్కపట్నం 118, నేదరపేట-91, గండ్లూరు 129, కొర్రపాడు 27, ఓబన్నపేట 158 దరఖాస్తులు ఇచ్చారని తహసీల్దార్ తెలిపారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయండి

ఎర్రగుంట్ల : స్వయం సహాయక పొదుపు సంఘాల బలోపేతంకు కృషి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏ రివ్యూ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి సంఘాలకు వస్తున్న సంక్షేమ పథకాలన్నింటిని సభ్యులందరికీ అందించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల గ్రేడింగ్, జగనన్నతోడు, హౌసింగ్ బిల్లు, స్త్రీనిధి ఇతర అంశాలపై వారితో క్షుణ్ణంగా చర్చించారు. జిల్లా స్థాయిలో మండలాన్ని ఉన్నతస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఓ జగదీశ్వరీ, నాగేంద్ర, సీసీలు సభ్యులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

కమలాపురం : మండల పరిధిలోని చిన్నచెప్పలికి చెందిన చెప్పలి మల్లమ్మ (77) అనాథ మృతదేహానికి మంగళవారం అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు అంత్యక్రియలు నిర్వహించారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మల్లమ్మ సోమవారం రాత్రి మృతి చెందిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ట్రస్ట్ సభ్యుల సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు హనుమంతు, సుబ్రమణ్యం, బాలస్వామి పాల్గొన్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేయండి

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పట్టు పరిశ్రమపై పట్టు సాధించాలని జిల్లా పట్టుపరిశ్రమ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక పట్టుపరిశ్రమ కార్యాలయంలో పట్టుపరిశ్రమ మండలాల ఇన్‌చార్జిలకు ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందుల ప్రాంతంలో గత ఏడాదిలో 20,060 ఎకరాలలో పట్టు సాగులో ఉండేదని.. ప్రస్తుతం అదనంగా 160 ఎకరాలలో సాగు చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మంచి దిగుబడి ఇచ్చే పట్టు పంటపై గ్రామీణ ప్రాంతాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. సిరికల్చర్‌లో ఐదులేక ఆరు పంటలను సాగు చేస్తే రైతులకు మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఒక పంటకు ఒక లక్ష ఆదాయం వస్తుందని.. ప్రస్తుత కాలంలో చాలా మంది రైతులు సెరికల్చర్ సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. వనిపెంట, ఊటుకూరు ప్రాంతాల నుంచి ఒక మొక్క రూ.2లతో ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఒక ఎకరాకు యూనిట్ ధర రూ.25 వేలు ఉంటే ..అందులో రూ.18,750ల సబ్సిడీని ప్రభుత్వం ఇస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అయితే 22,500ల సబ్సిడీ వర్తిస్తుందన్నారు. షెడ్డులు నిర్మించుకుంటే యూనిట్ ధర రూ.4 లక్షలు ఉంటే.. రూ.3 లక్షలు సబ్సిడీ వస్తుందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు అయితే రూ.3.60 లక్షల సబ్సిడీ వస్తుందన్నారు. పులివెందుల ప్రాంతంలో 160 ఎకరాలలో పట్టు సాగు చేయాలని లక్ష్యంతో మండలాల ఇన్‌చార్జిలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అగ్రికల్చర్‌లో పంటలు సాగు చేసిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. సెరికల్చర్‌లో పంటలు పండించే రైతులకు ఎటువంటి దళారీ వ్యవస్థ ఉండదన్నారు. రైతులు పండించిన పంటలను నేరుగా మదనపల్లె, ధర్మవరం, హిందూపురం, పలమనేరు, కదిరి ప్రాంతాల్లోని మార్కెట్లకు వెళ్లి విక్రయాలు జరుపుకోవచ్చునన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట్టు సాగు చేయడానికి చాలామంది రైతులు ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో మండలాల ఇన్‌చార్జిలు జగన్నాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులందరికీ ఓపీఎస్ అమ లు చేయాలని, ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఉద్యోగులు దేన్ని ఒప్పుకోరు అని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వెంకట జనార్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండారెడ్డి, ఖాదర్‌బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత, ప్రజా సంక్షేమ ప్రభుత్వానికి రెండు కళ్లు అని, ప్రజా సంక్షేమ కోసం ఉద్యోగుల హక్కులను హరించకూడదని పేర్కొన్నారు. వారికి అందవలసిన వేతన బత్యాలు సకాలంలో అందచేయాలని తద్వారా ఉద్యోగులు స్వేచ్ఛగా పనిచేసుకునే వెసులుబాటు కలిగించాలన్నారు. ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి

కడప వైఎస్ఆర్ సర్కిల్: చంద్ర రాజేశ్వరరావు అవిశ్రాంత పోరాట యోధుడని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర రాజేశ్వర రావు బలమైన కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాణం కోసం గట్టి పునాదులు వేశారన్నారు. సీపీఐ నాయకులు సుబ్రమణ్యం, ఎంవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గ్రామ సభలు లేకుండా అసైన్‌మెంట్ కమిటీలా?

అట్లూరు : గ్రామ సభలు నిర్వహించకుండా సర్పంచ్, ఎంపీటీసీ అనుమతులు లేకుండా అసైన్‌మెంటు కమిటీ ఎలా నిర్వహిస్తారని మండల ఉపాధ్యక్షుడు మణ్యం వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఎంపీపీ పొత్తపి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా మండల అధికారులు చేసిన, చేపట్టబోయే అభివృద్ధి పనులపై వివరించారు. తహసీల్దారు శ్రీవాణి వివరిస్తున్న సమయంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి మట్లాడుతూ అసైన్‌మెంటు కమిటీ జాబితా నాకు ఇవ్వలేదు, అర్హులను ఎంపిక చేసే క్రమంలో సంబంధిత సర్పంచు, ఎంపీటీసీ సభ్యుల ఆమోదం తప్పనిసరి అని తెలియదా? అని ప్రశ్నించారు. అందుకు తహసీల్దారు ఇంకా ఫైనల్ చేయలేదని, అందరి అమోదంతోనే అసైన్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మండలంలో జరుగుతున్న వివిధ శాఖల పనితీరుపై అధికారులు నివేదికలను చదివారు. పలువురు సభ్యులు తమ ప్రశ్నలను సభా ముందుకు తీసుకొచ్చారు. అధికారులు పనితీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ వెళ్లాల్సిన అవసరం అధికారులకు ఎంతైనా ఉందని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాతమ్మ, మండల ఉపాధ్యక్షుడు రాజోలు సుబ్బారెడ్డి, పంచాయతీ విస్తరణ అధికారి శివప్రసాద్, వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య, ఎంఈఓ విలియం రాజు, ఏపీఓ పార్వతి, ఏపీఎం సురేష్, ఏఈలు సత్యబాబు, సుధాకర్‌రెడ్డి, వెంకటేష్, ట్రాన్స్కో ఏఈ ఉమా, ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఏ.విజయమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో అధికారుల తీరును ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ ఎం.వెంకట్‌రెడ్డి

సమష్టి కృషితో డయేరియా నివారణ



మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్



మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేష్ కుమార్

ప్రొద్దుటూరు క్రైం : సమిష్టి కృషితో డయేరియాను పూర్తిగా నివారించవచ్చని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా వైఎంఆర్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో మంగళవారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 17వ తేది వరకు పక్షోత్సవాలను జరుపుకుంటున్నట్లు తెలిపారు. పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలకు డయేరియా, దాని వల్ల సంభవించే మరణాలను పూర్తిగా అరికట్టడమే పక్షోత్సవాల ప్రధాన లక్ష్యమన్నారు. అందుకు ప్రతి ఆరోగ్య, ఆశా కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు. అలాగే ప్రతి ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని తెలిపారు. అనంతరం వైఎంఆర్ కాలనీలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీ సుబ్బారెడ్డి, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అతిసార నియంత్రణపై అవగాహన

చాపాడు : గ్రామాలలోని ప్రజలకు అతిసార నియంత్రణపై అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 17వ దీ వరకూ అతిసార నియంత్రణ ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు గ్రామాలలో తరచూ పర్యటిస్తూ కుటుంబ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే సందర్భంగా డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సమీర మాట్లాడుతూ రానున్న వర్షాకాలం వచ్చే వ్యాధుల గురించి తెలిపారు. కలరా, టైఫాయిడ్, డయేరియా తదితర వ్యాధులపైన అవగాహన కల్పించారు. ఫ్యామిలీ డాక్టర్, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అమృత్ పథకంపై చర్చకు సిద్ధం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ప్రజలకు రోజూ తాగునీటిని అందించేందుకు టీడీపీ పాలనలో తెచ్చిన అమృత్ పథకం జీఓ అప్పుతో కూడుకున్నదని, అది ప్రజలకు ఎంతో భారంగా నిలిచిందని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. మంగళవారం వైఎంఆర్ కాలనీలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో అమృత్ పథకం ద్వారా ప్రజలకు తాగునీటిని అందించేందుకు జీఓ విడుదల చేసిందని, ఆ జీఓను బయట పెట్టగలరా అన్న ప్రతిపక్ష నాయకులు సవాల్‌ను ఆయన స్వాగతించారు. టీడీపీ విడుదల చేసిన జీఓను ప్రజలకు వివరించేందుకు తాను సిద్ధమని ప్రతిపక్ష నేత కూడా సిద్ధం కావాలన్నారు. చర్చకు సిద్ధం కాకపోతే తదుపరి మాట్లాడే అర్హత లేదని టీడీపీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. టీడీపీ పాలకమండలిలో కేవలం రూ.8కోట్ల మేర పనులు చేసి వదిలేశారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలకమండలి అధికారం చేపట్టిన తర్వాత సత్వర చర్యలు తీసుకుని పనులు పూర్తి చేశామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కలిపి 12 శాతం ఖర్చు చేస్తే మిగిలిన 88 శాతం మున్సిపాలిటీపై భారం పడిందన్నారు. అదే జీఓ గ్రాంట్ రూపంలో విడుదల చేసింటే మున్సిపాలిటీకి భారం పడేది కాదన్నారు.



టీడీపీ విడుదల చేసిన జీఓను చూపిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు రూ.3,500 కోట్లు నిధులు తెచ్చిన ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెట్టించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి గత నాలుగేళ్లలో రూ.3,500 కోట్లు తెచ్చిన ఘనత ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిది అని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు పాదయాత్రలో నారా లోకేష్ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రూ.3 లక్షల రోడ్డు కూడా వేయలేదని వ్యాఖ్యానించడాన్ని ఆయన ఖండించారు. టీడీపీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకున్నారా అని ప్రశ్నించారు. వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి మాట్లా డారు. ఏపీ అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, కామిశెట్టి బాబు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి తిరుప్పావడ సేవ

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ, కలశస్థాపన, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయంలో శ్రీవారి విమాన గోపురం, రాజగోపురం నూతనంగా నిర్మించిన సందర్భంగా నిర్వహిస్తున్న కుంభాభిషేక మహోత్సవాలల్లో భాగంగా మంగళవారం ఉదయం తిరుప్పావడ సేవ, పంచగవ్యము, గోపురశుద్ధి, శయ్యాధివాసము, కలశ శుద్ధి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మెంటా అశోక్‌కుమార్, దేవాదాయశాఖ కార్య నిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ కమిటీ సభ్యులు నాగమణి, చంద్రయ్య, పెద్దవీరయ్య, రమణమ్మ, లక్షుమ్మ, సుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ, చిన్న గురవయ్య, ఆలయ ప్రధాన అర్చకులు కామసముద్రం లక్ష్మివెంకట వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారికి తిరుప్పావడ సేవ నిర్వహించిన వేదపండితులు

నిబంధనల మేరకే మట్టి తవ్వకాలు

వల్లూరు : నిబంధనల మేరకే చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి తప్ప ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగలేదని, టీడీపీ నేతలు నిజాలు తెలుసు కోకుండా వైఎస్ఆర్‌సీపీ నేతలు నిబంధనలు అతిక్రమించి లోతుగా మట్టి తవ్వకాలను జరుపుతున్నారని అసత్య ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని వైఎస్ఆర్‌సీపీ నేతలు విమర్శించారు. కడపలోని జిల్లా వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి భూసిపాటి కిషోర్ కుమార్, పార్టీ నేతలు విశ్వనాథరెడ్డి, బాల మైసూరారెడ్డి, పుల్లయ్యలు మాట్లాడారు. ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డిని టీడీపీ నేత నారా లోకేష్ విమర్శించడం హాస్యాస్పదంగా వుందన్నారు.

చెన్నూరు : నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా చెన్నూరులో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిని విమర్శించడం తగదని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎల్లమ్మ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాసిచ్చింది చదవడం తప్ప, అందులో నిజానిజాలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదన్నారు.